క్లుప్తంగా

బోర్‌వాటర్‌లో దుర్వాసన

బాలానగర్: గౌతమ్‌నగర్‌లోని ఇంటి నం.7-8-188/2లో ఐదు కుటుంబాలు నివసిస్తున్నాయి. 15 రోజుల నుంచి బోర్‌వాటర్ నుంచి దుర్వాసన వస్తోందని వారు తెలుపుతున్న. కొద్ది రోజుల క్రితం తమ వీధిలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం జరిగిందని ఆ తర్వాత నుంచి దుర్వాసనతో బోర్‌వాటర్ వస్తోందని తెలిపారు. సమస్యను వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదరన్నారు.

మత్తుపదార్థాల నియంత్రణకు కృషి చేయాలి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: దేశభవిష్యత్ యువతరంపైనే ఆధారపడి ఉందని వారు సక్రమ మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని ఆల్కాహాల్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు పట్టి పీడిస్తున్నాయని వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ కంట్రీగా రూపొందించేందుకు కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

మోతీనగర్: న్యూ అల్లాపూర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను అనుకున్న సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, కానిస్టేబుల్ జ్యోతి, కాంట్రాక్టర్ యాదగిరి, నాయకులు నజీర్, మల్లేష్, ఇస్మాయిల్, సంజీవరెడ్డి, రఫియా తదితరులు పాల్గొన్నారు.

మహిళల గౌరవానికి భంగం కలిగించొద్దు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని, వారి స్వేచ్ఛకు ఏ మాత్రం భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ మర్యాదగా ప్రవర్తించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ, నిషేదం, పరిష్కార చట్టంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహిళలు పని చేసే ప్రదేశంలో వారి స్వేచ్ఛ, మర్యాదలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా వారి హక్కులను పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను తప్పకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూఓ) అక్కేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన మేడ్చల్ జిల్లా జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ గ్రామ కార్యదర్శులు గత నెల 28 నుంచి డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారన్నారు. ,అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రోడ్ల పాలు చేయటం దారుణమన్నారు. వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో 50 మందికి గ్రామ కార్యదర్శులు చనిపోయారని, వారికి ఎలాంటి భద్రత లేకపోవడం దారుణమని, చివరికి వారి అంత్యక్రియలను కూడా చందాలు వేసుకుని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జూనియర్ గ్రామ కార్యదర్శుల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థలకు చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా నోటిఫికేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని ఓయూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ భీమ్‌రావునాయక్, ఈశ్వర్‌లాల్, మెడ శ్రీను ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో జేఎల్, డీఎల్ పోస్టుల భర్తీలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగాల క్రమబద్ధీకరణపై పునరాలోచన చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.



హెచ్ఏఎల్‌లో కార్మికుడిగా పనిచేసే కర్ర నాగరాజుకు శ్రమ శక్తి అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, బిత్తిరి సత్తి



జీహెచ్ఎంసీ కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకల్లో డీసీలు రవికుమార్, రవీందర్ కుమార్





సీఐటీయూ ఆధ్వర్యంలో బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో భారీ ర్యాలీలో కార్మికులు



కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం



మేడే వేడుకల్లో పాల్గొన్న పీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం తదితరులు

మే డే

- దేశ ప్రగతి రథానికి కార్మికులే చక్రాలు
- కార్మికుల చెమట చుక్కలే ఇంధనం

అమెరికాలోని షికాగోలో కార్మికులు పని గంటలను తగ్గించాలని మొట్టమొదటిసారి భారీ ప్రదర్శన చేసిన నాటి నుంచే ఈ మే డే ఉద్యమానికి పునాది పడింది.ఆ తర్వాత నుంచి మే డేను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తూ వస్తున్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మే డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కార్మిక జెండాలను ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పరిశ్రమల అభివృద్ధిలో శ్రామికుల శ్రమ దాగి ఉందన్నారు. దేశ ఆర్థిక సామాజిక సాంస్కృతిక అభివృద్ధి మొత్తం కార్మికుల కండరాల మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. శ్రామికుల సంతోషంగా ఉంటేనే సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందినట్లుగా భావించాలన్నారు. దేశ ప్రగతి అనే రథానికి కార్మికులే చక్రాలని.. వారి చెమట చుక్కలే ఇంధనాలు అని వారిని కొనియాడారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)

మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఆల్విన్ కంపెనీలో నేనూ ఓ కార్మికుడిగా పనిచేశా

- మేడే వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు
- కార్మికులు ఏకమై కేంద్రంపై పోరాడాలి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని రమ్యాగ్రౌండ్స్ వద్ద కార్మికుల కోసం రూ.50 లక్షలతో చేపట్టనున్నారు. సోమవారం ఈ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మేడే వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. తాను ఒకప్పుడు ఆల్విన్‌కంపెనీలో ఒక కార్మికుడిగా పనిచేశానని కష్టనష్టాలు తనకు తెలుసని అన్నారు. కార్మికులు లేనిదే వ్యవస్థ నడవదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పెద్ద కంపెనీలను తీసుకువచ్చి కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న నాయకుడు మంత్రి కేటీఆర్ అని అన్నారు.

◆ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కంపెనీలను తీసుకువస్తుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం కంపెనీలను అమ్మకానికి పెడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ కంపెనీలను అమ్మకానికి పెడుతున్న బీజేపీ ప్రభుత్వంపై కార్మికులు అంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి సుమారు 200 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం రక్తదానం కార్యక్రమంలో కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని ఎమ్మెల్యే కృష్ణారావు అభినందించారు.



కార్మిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

సమష్టిగా పనిచేసి బీజేపీని గెలిపించుకోవాలి

బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ బీజేపీలో భారీ ఎత్తున యువకులు సోమవారం సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అల్లాపూర్ డివిజన్ నుంచి పార్టీలో చేరటం పార్టీకి మంచి బలం చేకూరిందన్నారు. అదేవిధంగా అందరం సమష్టిగా పనిచేసి కూకట్‌పల్లిలో బీజేపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

◆ అనంతరం వడ్డేపలి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా యువకులు బీజేపీలో చేరటం చాలా సంతోషంగా ఉందన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు బీజేపీ గెలిచిన తర్వాత ఉండవన్నారు. కార్యకర్తలు కూకట్‌పల్లిలో బీజేపీని గెలిపించి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

◆ శివాజీనగర్‌కు చెందిన యువ నాయకులు సునీల్ జాదవ్, మహేష్ గౌడ్, ఆర్‌కె నగర్‌కు చెందిన యువ నాయకుల ఆధ్వర్యంలో మోతీనగర్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి వడ్డేపల్లి రాజేశ్వరరావుకు ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ బోరబండ చౌరస్తాలోని సాయిబాబా మందిరం వద్దకు చేరుకోగానే యువ నాయకులు సునీల్ జాదవ్, మహేష్‌గౌడ్ మిత్రులతో క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేసి హనుమంతుని గదను బహూకరించి సత్కరించారు.

◆ డివిజన్ అధ్యక్షుడు విజయ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు అర్శనపల్లి సూర్యారావు, శ్రీకర్‌రావు, పులిగొళ్ల శ్రీనివాస్, సద్గుణ రెడ్డి, శ్రీలక్ష్మీ, అమ్రేష్ రాజు, చింటూ, మన్మధ, సుమన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ నేతలు తదితరులు

విధుల్లో నుంచి తొలగించడం దారుణం



గాంధీ ఆస్పత్రి: కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి గాంధీ ఆస్పత్రిలోని కరోనా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు చికిత్స అందించిన పేషెంట్ కేర్ సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించడం దారుణమంటూ సోమవారం గాంధీ ఆస్పత్రి ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ఐదుమంది తోటి సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని వెంటనే తొలగించిన 244 మందిని విధుల్లోకి తీసుకోకపోతే తమకు చావేగతి అని దీనికి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ అధికారులు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నందిని, దివ్య, సరిత, సంధ్య, తేజ, విజయ్, కరుణాకర్, వేణు, శంకర్ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం

బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఆల్విన్‌కాలనీ: ఆధ్యాతిక కార్యక్రమాలతో పాటు పాఠశాల విద్యార్థుల మనో వికాసానికి పాటుపడుతున్న బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయమని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం వివేకానందనగర్‌లోని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల ఉచిత సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు బడి పాఠాలతో పాటు బతుకు పాఠాలు కూడా నేర్పడం చాలా అవసరమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు ఎంత ముఖ్యమో వివరించడం హర్షణీయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ఎస్ఆర్‌నగర్ సెంటర్ ఇన్‌చార్జ్ బీకే జ్యోతి, గాజుల రామారం సెంటర్ ఇన్‌చార్జి బీకేఅనురాధ, కేపీహెచ్‌బీ సెంటర్ ఇన్‌చార్జ్ బీకే పద్మ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, బ్రహ్మకుమారీలు

సాయిబాబా ఆశీస్సులతో అందరూ బాగుండాలి

కూకట్‌పల్లి: బాలాజీనగర్ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో సోమవారం బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు.

కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గూడెపు నాగరాజు, జ్యోతిల చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. కూకట్‌పల్లి డివిజన్ జనరల్ సెక్రటరీగా గురుమూర్తి, ఉపాధ్యక్షులుగా పాపారావు, తలారి భానుచందర్, రమణా, చేగూరి నరేందర్, దీపక్, జాయింట్ సెక్రటరీలు సింగూరి మహేందర్, బొట్టు రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మనోజ్‌గౌడ్, జీవన్, సత్యనారాయణ, మేఘా ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు అనిల్ కిషోర్, బీసీ సెల్ అధ్యక్షుడు దుసకంటి కళ్యాణ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ కరీంకు నియామకపత్రాలను అందజేశారు.



కూకట్‌పల్లి డివిజన్ కమిటీ నాయకులకు నియామక పత్రాలను అందజేస్తున్న నాగరాజు, జ్యోతి

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.164.20 కోట్లు

- 2022-23లో రూ.152 కోట్లకుగాను, రూ.156 కోట్లు పంపిణీ
- కార్యాచరణ ఖరారు చేసిన డీఆర్‌డీఏ

సాక్షి,మేడ్చల్ జిల్లా: పొదుపు సంఘాల మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా రుణాలు అందజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణ లక్ష్యాలను నిర్దేశించి, బ్యాంకు అధికారుల సమన్వయంతో పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగానే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 164.20 కోట్లుగా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఖరారు చేసింది. రానున్న మార్చి 31 నాటికి 2,703 స్వయం సహాయక మహిళా సంఘాలకు నిర్దేశించిన ఈ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏపీఎం, సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను మించి రుణ లక్ష్యం పంపిణీలో ముందంజలో ఉంది. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,852 మహిళా సంఘాలకు రూ. 152.92 కోట్ల రుణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, 2,992 మహిళా సంఘాలకు రూ.156.98 కోట్లు పంపిణీ చేసి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ముందంజలో నిలిచింది.



కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీ తులసినగర్ జీవన్‌జ్యోతి స్కూలులో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, యడ్ల సత్యనారాయణ, కైసర్, నాగేశ్వరరావు, స్వప్న, వరలక్ష్మీ, మిత్రవింద, శోభ, అరుణ కుమారి, వనజ, డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది సంతోషి, శశిరేఖ, స్వాతి, భాగ్యలక్ష్మీ, స్వప్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు 32 ఫిర్యాదులు అందించినట్లు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలోడీఆర్‌ఓ లింగ్యానాయక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పాలక్ విజయశాంతి ప్రత్యేక పూజలు





విజయశాంతికి ఆహ్వానం పలుకుతున్న చైర్మన్


కూకట్‌పల్లి: న్యూ బాలాజీనగర్ కాలనీలోని సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవ మహోత్సవాలను ఆలయ కమిటి చైర్మన్ సాదు ప్రతాప్‌రెడ్డి వైభవంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, కూకట్‌పల్లి పాలక్ విజయశాంతి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ కమిటీ శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి చరణ్‌కుమార్, జిల్లా నాయకులు భక్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు



కేపీహెచ్‌బీకాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరుపేదలు అనేక సంవత్సరాలుగా నోటరీ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని నోటరీ స్థలాలను రెగ్యులరైజ్ చేయాలంటూ ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువరించనున్నట్లు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని సమస్యలు, స్థానిక పరిస్థితుల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందరికీ మేలు చేకూరేలా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, దానం నాగేందర్, మాగంటి గోపినాథ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నాగమణి (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: డ్యూటీకి వెళ్లిన ఓ యువతి ఇంటికి తిరిగి రాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటలో నివాసం ఉంటున్న కోరుకొండ లక్ష్మి ఆమె కుమార్తె నాగమణి (19)తో కలిసి నివాసం ఉంటోంది. నాగమణి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆదివారం రోజు మాదిరిగా కంపెనీకి డ్యూటీకి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవటంతో ఆందోళనకు గురైన లక్ష్మి కంపెనీకి ఫోన్ చేసి అడగ్గా నాగమణి సాయంత్రం 4 గంటలకే కంపెనీ నుంచి వెళ్లిపోయిందని సమాచారం ఇచ్చారు. దీంతో ఆందోళనకు గురైన చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారించగా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో కూకట్‌పల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంత్ నిరంకారి మిషన్ సేవలు ప్రశంసనీయం

కూకట్‌పల్లి: సంత్ నిరంకారి మిషన్ కూకట్‌పల్లి బ్రాంచ్ నిర్వాహకులు వేసవిని దృష్టిలో పెట్టుకుని జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్, నిజాంపేట్ సెంటర్‌లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఇన్‌చార్జి మోహిని అహూజా, కూకట్‌పల్లి బ్రాంచ్ ముఖి జ్ఞాన ప్రచారకులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంత్ నిరంకారి మిషన్ సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయటం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బ్రాంచ్ సేవాదళ్ అధికారులు జంగయ్య, లక్ష్మీ సాయి, జ్ఞాన ప్రచారకులు మాధవి, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

